
—యస్.జయశ్రీ

# లవ్ ట్రా(ప్)క్

## వన్ షాట్ టూ బర్డ్స్



ఇంటికి ఫుల్ డోస్‌తో వచ్చాడు 'రవి తలుపు తట్టకముందే తలుపు తీసింది సునీత.

"హాయ్... నీత... నువ్వింక నిద్రపోలేదా డార్లింగ్?" తడబడుతూ లోపలకొచ్చాడు.

"..."

"మాట్లాడవోయ్... ఓ... మందు కొట్టానని కోపమా?"

"...." ఈసారీ మాట్లాడలేదు ఆమె.

"సారీ డియర్... తాగొద్దు... తాగొద్దు... అనుకుంటూనే తాగాను."

"సర్లేండి. రోజు వుండేదేగా... పదండి భోంచేద్దురు"

డ్రెస్ మార్చుకొచ్చిన రవి డైనింగ్ టేబుల్‌పై ఒక్క ప్లేటు ఉండటంచూసి—

"నువ్వు భోంచేసావా నీతా?" అని అడిగాడు

"తినలేదు"

"మరి నీ ప్లేట్ కూడా తెచ్చుకో?"

"ఉహూ... తినను" ఖచ్చితంగా చెప్పింది.

మూతలుపడ్తున్న కళ్లను బలవంతాన విప్పార్చి చూశాడు.

పాలిపోయిన చెక్కిళ్ళు... గుంటలు పడిన కళ్ళు... నీరసంతో పీక్కుపోయిన ముఖం.

తను రోజూ రాత్రిపూట తాగుతున్నాడని సునీత నాలుగురోజుల్నుంచి అన్నం తినటంలేదు. మొదటిరోజు బెదిరిస్తోందేమో అనుకున్నాడు.

ఉహూ ఓపికలేకపోయినా పట్టుదలగా తిరుగుతోంది.

మనస్సు కలుక్కుమంది రవికి.

ఛ... తన పాడుఅలవాటు మానడంకోసం తనని తాను హింసించుకొంటున్న భార్యను చూస్తే జాలేసింది.

అసలు ఆ నిముషంలో తాగిందంతా కక్కాలనిపించింది.

గబుక్కున్న లేచి సునీత రెండు చేతులూ పట్టుకుని "నీతా... రేపట్నించి నీ ఇష్టప్రకారమే నేను తాగను. ప్రామిస్. కానీ నువ్వు మాత్రం ఇలా తిండి మానేసి నన్ను బాధపెట్టకు" బ్రతిమిలాడాడు.

"నిజంగా తాగరా?"

"ప్రామిస్ అన్నానా... మరింక భోంచేద్దాం రా!"

"రేపట్నుంచి తింటాలేండి. ఈరోజు మీరు తాగే వున్నారుగా" కాస్త దిగివచ్చింది సునీత.

"సరే! ఇన్నాళ్ళు నిన్ను ఏడిపించినందుకు ఈరోజుకి నేను తినను. పద పడుకొందాం" అంటూ సునీత వెనకాలే బెడ్‌రూమ్‌లోకి నడిచాడు రవి.

*   *   *

"కంగ్రాట్స్ సునీత మొత్తానికి నీ మొగుడి "డ్రింక్" హాబీ మానిపించావే"

"థాంక్యూ... కానీ నాకు ఇంకొక లాభం కూడాను." ఫ్రెండ్‌తో అంది సునీత.

"ఏమిటో అది చెప్పవోయ్"

"ఆ మధ్య నేచర్ క్యూర్ సెంటర్‌కెళితే ముందుగా మూడురోజులు పూర్తిగా డయిట్ మానేయ్యాలన్నారు. ఇదిగో ఈసాకుతో మానేశాను" అటు నా వళ్ళు తగ్గింది. ఇటు మా ఆయనా దార్లో కొచ్చారు" పకపకా నవ్వుతోంది సునీత. ✽